


మీది కుంటలో పోసిన మట్టి

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



సంగారెడ్డి 5 మెదక్ జిల్లాల వార్తలు

శనివారం 5 ఏప్రిల్ 2025


మీదికుంట మాయం

ఆరు ఎకరాల్లో జలాశయం.. నాలుగెకరాలు అన్యాక్రాంతం

ఐడీఏ బొల్లారం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : ఆక్రమణలకు కాదేదీ అనర్హం అన్నట్టుగా ఐడీఏబొల్లారం పారిశ్రామికవాడలో జలాశయాలు కబ్జాలకు గురవుతున్నాయి. కుంటలను ఇష్టారీతిన కబ్జా చేసి అమ్ముకుంటున్నారు. ఐడీఏ బొల్లారంలో దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి వచ్చినవారు వివిధ పరిశ్రమల్లో కార్మికులుగా పనిచేస్తూ నివాసం ఉంటున్నారు. ఇక్కడ స్థలాలకు ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. దీంతో, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు ఇష్టారీతిన కుంటను ఆక్రమించి సొమ్ము చేసుకుంటున్నారు. కుంటలో మట్టిపోసి రేకులతో ఇళ్లు నిర్మించి రూ.20 లక్షలకు ఒకటి చొప్పున విక్రయిస్తున్నారు. పట్టణం పరిధిలోని సర్వే నంబర్ 230లో ఆరెకరాల్లో మీదికుంట విస్తరించి ఉంది. ఆక్రమణల కారణంగా ప్రస్తుతం రెండు ఎకరాల్లో మాత్రమే కుంట ఉంది. మిగిలిన నాలుగెకరాలు ఆక్రమణలకు గురయ్యింది. ఇళ్లను నిర్మించడంతోపాటు పౌల్ట్రీ షెడ్లు ఏర్పాటుచేసి కోళ్ల పెంపకం చేపట్టారు. చుట్టూ కంచె వేసి మూసివేశారు. వర్షాలు కురిస్తే చుట్టు పక్కల కాలనీల్లోకి వర్షపునీరు చేరుతున్నది. అయినా మున్సిపల్, నీటిపారుదల, రెవెన్యూశాఖల అధికారులు పట్టించుకోవడంలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



ఆక్రమణకు గురైన మీది కుంట



జగ్గారెడ్డి ఆధ్వర్యంలో శ్రీరామనవమి ఏర్పాట్లు

రాములోరి కల్యాణానికి ముస్తాబవుతున్న సంగారెడ్డి రాంమందిరం

సంగారెడ్డి టౌన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 6న జరుగనున్న శ్రీరామ నవమి వేడుకలకు సంగారెడ్డి పాత బస్టాండ్ సమీపంలోని రామ్‌మందిరంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆధ్వర్యంలో జరుగనున్న శ్రీరాములవారి కల్యాణానికి ఆలయాన్ని సుందరంగా ముస్తాబు చేశారు. ఈ కల్యాణ వేడుకలను తిలకించేందుకు వచ్చే వందలాది మంది భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సీతారాముల కల్యాణ వేడుకను జగ్గారెడ్డి-నిర్మలారెడ్డి దంపతులు జరిపించనున్నారు.



◄ శ్రీరామనవమి వేడుకల జగ్గారెడ్డి-నిర్మలారెడ్డి కరపత్రాలు ►



కుక్కల దాడిలో మృతిచెందిన జింక

జింకను చంపిన వీధి కుక్కలు

రామాయంపేట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): అడవి వదిలి ఊళ్లోకి వచ్చిన ఓ జింకను వీధి కుక్కలు వెంటాడి దాడి చేసి చంపాయి. ఈ ఘటన మెదక్ జిల్లా రామాయంపేట మండలం తొనిగండ్ల శివారులో శుక్రవారం వేకువజామున జరిగింది. జింక అడవి నుంచి దారితప్పి గ్రామంలోని రావటంతో కుక్కల మూక దాడి చేసింది. విషయాన్ని గుర్తించిన గ్రామస్థులు అక్కడికి వెళ్లేసరికే అది ప్రాణాలు కోల్పోయి ఉంది. ఈమేరకు ఫారెస్ట్ అధికారులకు సమాచారం చేరవేశారు. ఘటనాస్థలికి చేరుకున్న అధికారులు చనిపోయిన జింక కళేబరానికి దహన సంస్కారాలు చేశారు. అడవి నుంచి వచ్చిన జంతువులను వీలైతే ప్రజలు రక్షించి తమకు అప్పగించాలని ఫారెస్ట్ అధికారులు కోరారు.

పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

పుల్‌కల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): పుల్కల్ మండలం సింగూరు గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎస్‌బీవీ రంగయ్యను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ వల్లూరు క్రాంతి గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. గ్రామంలో ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు, జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీలో అవినీతికి పాల్పడుతున్నారంటూ కార్యదర్శి రంగయ్యపై మార్చి 9న గ్రామస్థులు ఎంపీడీవో, జిల్లా కలెక్టర్‌లకు ఫిర్యాదు చేశారు. ప్రతీ పనికి ఒక రేటు నిర్ణయించి లంచాలు దండుకుంటున్నారంటూ తీవ్ర ఆరోపణలు చేశారు. దీనిపై సంగారెడ్డి డివిజన్ పంచాయతీ అధికారి అనిత అదే నెల 12న గ్రామంలో బహిరంగ విచారణ జరిపారు. కార్యదర్శి రంగయ్య అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నట్లుగా గ్రామస్థులు ఆరోపించారు. నిర్ధారించిన ఇంటి పన్నుల కంటే అదనంగా ప్రజల నుంచి అధికంగా వసూలు చేసి సొంతానికి వాడుకున్నట్లు వెల్లడయింది. డీఎల్పీ అనిత విచారణ నివేదిక ఆధారంగా కార్యదర్శి రంగయ్యను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

రెమ్యునరేషన్ ఏది?

కుటుంబ సర్వే ముగిసి 4 నెలలు

అందని పారితోషికం.. ఆందోళనలో ఆపరేటర్లు



మెదక్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): సమగ్ర కుటుంబ సర్వే ముగిసి నెలలు గడుస్తున్నా పారితోషికం మాత్రం చెల్లించడం లేదని డాటా ఎంట్రీ ఆపరేటర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత నవంబరు, డిసెంబరు మాసాల్లో సుమారు 43 రోజుల పాటు జిల్లావ్యాప్తంగా మున్సిపాలిటీలు, పల్లెలు, పట్టణాలలో సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ కులగణన సర్వే నిర్వహించారు. మొదట మూడు రోజుల పాటు ఇంటింటికీ తిరుగుతూ స్టిక్కర్లు అతికించారు. ఆ తర్వాత పలు శాఖల ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఇల్లిల్లూ సందర్శిస్తూ సుమారు 75 రకాల ప్రశ్నలకు సమాధానాలు రాబట్టి, వివరాలు నమోదు చేశారు. తదనంతరం సర్వే వివరాలు ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేయడానికి డాటా ఎంట్రీ ఆపరేటర్ల సేవలను ప్రభుత్వం వినియోగించుకుంది. ఆన్‌లైన్ ఎంట్రీ చేయడానికి ప్రభుత్వ ఆపరేటర్లతో పాటు కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్న యువతీ, యువకులను తీసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా 21 మండలాలు, 4 మున్సిపాలిటీల పరిధిలో నిరుద్యోగుల సేవలను వినియోగించుకున్నారు. ఒక్కో ఎంట్రీకి రూ. 30 పారితోషికం చెల్లిస్తామని ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇక ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే ఆపరేటర్లకు రోజుకు రూ.350 చొప్పున పారితోషకం ఇవ్వనున్నట్లు అధికారులు తెలిపారు. జిల్లావ్యాప్తంగా 860 మంది ప్రవేట్, 338 మంది ప్రభుత్వ ఆపరేటర్లు సమగ్ర కుటుంబ, ఆర్థిక, రాజకీయ, కులగణన సర్వే వివరాలను కంప్యూటర్లలో నిక్షిప్తం చేశారు. ఎంట్రీలు పూర్తి చేసిన తర్వాత ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు బ్యాంకు ఖాతా వివరాలు తీసుకున్నారు. సర్వే ముగిసి నాలుగు నెలలు గడుస్తున్నా ఇప్పటికీ ప్రకటించిన పారితోషికం ఇవ్వలేదు. జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ, ప్రై వేట్ డాటా ఎంట్రీ ఆపరేటర్లకు రూ.66,19,860 ఇవ్వాల్సి ఉంది. చిరు ఉద్యోగులు, నిరుద్యోగులు పారితోషికం డబ్బులు ఎప్పుడు వస్తాయా అని ఎదురుచూస్తున్నారు. సర్వే నిర్వహించిన పంచాయతీ కార్యదర్శులు, మున్సిపల్ ఉద్యోగులు, టీచర్లు మెప్మా రీసోర్స్ పర్సన్లు, సీవోలకు ఇటీవల రూ. 2.9 కోట్లు పారితోషికం చెల్లించారు. అదేవిధంగా తమకు రావాల్సిన కూడా పారితోషకం కూడా ఇవ్వాలని ఆపరేటర్లు కోరుతున్నారు.

త్వరలోనే డాటా ఎంట్రీ ఆపరేటర్లకూ పారితోషికం



జిల్లాలో నిర్వహించిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కులగణన సర్వే నిర్వహించగా డాటా ఎంట్రీ ఆపరేటర్లు సర్వే వివరాలను కంప్యూటర్లలో నిక్షిప్తం చేశారు. వారికి ముందుగా పేర్కొన్నట్లు పారితోషికం ప్రభుత్వం అందజేస్తుంది. ఇటీవలనే సర్వేలో పాల్గొన్న ప్రభుత్వ ఉద్యోగులకు రెమమ్యునరేషన్ అందజేశాం. త్వరలోనే ఆపరేటర్లకూ చెల్లిస్తాం. ముందుగా ఒప్పందం చేసుకున్నట్లు ఆపరేటర్లకు రూ.750, లేదా ఒక్కో ఎంట్రీకి రూ.30 చొప్పున చెల్లిస్తాం.

-బద్రీనాథ్, మెదక్ జిల్లా ప్రణాళికాధికారి



విద్యార్థులను తీర్చిదిద్దాలి

- జేఎన్టీయూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కిషన్‌కుమార్‌రెడ్డి
- సుల్తాన్‌పూర్ క్యాంపస్‌ను సందర్శించిన వీసీ

7



సంకల్పానికి.. విధి చేతులెత్తింది!

- నాలుగేళ్లకే కంటి చూపు కోల్పోయినా.. పట్టుదలతో పీజీ పూర్తి
- ప్రభుత్వ లెక్చరర్‌గా ఉద్యోగం
- రెండు పుస్తకాల రచన

7

ప్రైవేట్ ఆస్పత్రుల్లో పని చేస్తే చర్యలు

- ప్రభుత్వ వైద్యులపై నిఘా పెట్టాం
- హైవేలపై 75 ట్రామా కేంద్రాలు
- మంత్రి దామోదర్ రాజనర్సింహ



తూప్రాన్ ఆస్పత్రిలో రోగులతో మాట్లాడుతున్న మంత్రి దామోదర్



నర్సాపూర్‌లో చెక్కును అందజేస్తున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ

తూప్రాన్/నర్సాపూర్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వ వైద్యులపై నిఘా పెట్టామని, కొందరు ప్రభుత్వ వైద్యులు రోగులను ప్రైవేట్ ఆస్పత్రులకు రిఫర్ చేస్తున్నారని, ప్రైవేట్ ఆస్పత్రులను ప్రోత్సహించినా.. ప్రభుత్వ వైద్యులు ప్రభుత్వ ఆస్పత్రుల్లో పని చేసినా కఠిన చర్యలు ఉంటాయని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా పేర్కొన్నారు. శుక్రవారం మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఐదు పడకల డయాలసిస్ కేంద్రం మంత్రి ప్రారంభించారు. వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్‌తో కలిసి వైద్యశాఖ అధికారులు, వైద్యులతో సమీక్షా నిర్వహించారు. నర్సాపూర్‌లో 645 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబాకర్ చెక్కులను పంపిణీ చేశారు. రేషన్ దుకాణాల్లో సన్నబియ్యం పంపిణీని ప్రారంభించారు. ప్రభుత్వ ఆస్పత్రులను ప్రైవేటుకు ధీటుగా తీర్చిదిద్దాలని సూచించారు. రాష్ట్రంలో రీజనల్ కేన్సర్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నామని వివరించారు. రాష్ట్రంలోని వివిధ ఆస్పత్రుల్లో 80 అంబులెన్స్ అవసరమున్నట్లు దరఖాస్తులు వచ్చాయని, సీఎస్ఆర్ నిధులతో అబులెన్స్‌లు ఏర్పాటు చేస్తామని మంత్రి వివరించారు.

ట్రామా కేంద్రాలు.. అంబులెన్స్‌లు

జాతీయ రహదారులపై రోడ్డు ప్రమాదాలలో గోల్డెన్ అవర్ ప్రాణాలు కాపాడాలన్న ఉద్దేశంతో జాతీయ రహదారులపై ట్రామా కేంద్రాలు, బ్లాక్ స్పాట్‌లలో అంబులెన్స్‌లు అందుబాటులో ఉంచాలనే రెండు పాలసీలను తీసుకున్నట్లు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ్మ పేర్కొన్నారు. జాతీయ రహదారులపై 35 కిలోమీటర్లకు ఓ ట్రామా కేంద్రం ఏర్పాటు చేస్తున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 75 ట్రామా కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి దామోదర్ వివరించారు. అనంతరం తూప్రాన్ పట్టణ పరిధి అల్లాపూర్ శివారులోని గురుకుల పాఠశాల కళాశాలను మంత్రి సందర్శించి విద్యార్థులతో కలిసి బోజనం చేశారు. తూప్రాన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరు యాదవరెడ్డి, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్‌పర్సన్ చిలుముల సుహాసినిరెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్, నర్సాపూర్ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, తెలంగాణ ఫుడ్స్ మాజీ చైర్మన్ గంగుమల్ల ఎలక్షన్‌రెడ్డి, గృహ నిర్మాణ సంస్థ మాజీ చైర్మన్ మడుపు భూంరెడ్డి, జిల్లా వైద్యాధికారి శ్రీరామ్, డీసీహెచ్‌వో శివదయాల్, తూప్రాన్ ఆసుపత్రి సూపరింటెండెంట్ అమర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు. నర్సాపూర్‌లో ఎమ్మెల్యే సునీతారెడ్డి, కలెక్టర్ రాహుల్‌రాజ్, గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి, అదనపు కలెక్టర్ నగేష్, ఆర్డీవో మహిపాల్, పీఏసీఎస్ చైర్మన్లు రాజుయాదవ్, వెంకట్రామ్‌రెడ్డి, డీసీసీ డైరెక్టర్ గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోటాపోటీ నినాదాలు

నర్సాపూర్‌లో మంత్రి కార్యక్రమం ముగిసిన అనంతరం కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు ఒకరికొకరు పెద్ద ఎత్తున నినాదాలు చేయడంతో కొంత గందరగోళం ఏర్పడింది. అంతకుముందు ఎమ్మెల్యే సునీతారెడ్డి మాట్లాడుతూ కల్యాణలక్ష్మి డబ్బులతో పాటు తులం బంగారం కూడా ఇస్తామని.. మాట తప్పారని విమర్శించారు. నియోజకవర్గంలో ప్రొటోకాల్ ప్రకారం తనకు ఇవ్వాల్సిన గౌరవం ఇవ్వడం లేదని సునీతారెడ్డి మండిపడ్డారు.

మెడికల్ కాలేజీకి బస్సు అందజేత

సంగారెడ్డి రూరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి మెడికల్ కళాశాలకు తోషిబా పరిశ్రమ యాజమాన్యం అందజేసిన బస్సును సంగారెడ్డి కలెక్టరేట్‌లో శుక్రవారం కలెక్టర్ క్రాంతితో కలిసి మంత్రి దామోదర్ రాజనర్సింహ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మంత్రి సూచనతో పరిశ్రమ సీఎస్ఆర్ నిధులు రూ.33 లక్షలతో కొత్త బస్సును అందజేశారని తెలిపారు.

7



రాములోరికి వెండికిరీటాలు

బహూకరించిన అజ్ఞాత భక్తులు

ఎదురుచూపులు

గజ్వేల్ నియోజకవర్గంలో ప్రొటోకాల్ సమస్య

గజ్వేల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ డివిజన్ పరిధిలోని కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు ఎదురుచూపులు తప్పడం లేదు. ఆరునెలలుగా లబ్ధిదారులకు మంజూరైన చెక్కులు డివిజన్ కార్యాలయంలోనే మూలుగుతున్నాయి. చెక్కుల పంపిణీకి నియోజకవర్గంలో ప్రోటోకాల్ సమస్య వచ్చిపడింది. అధికారికంగా కాంగ్రెస్‌లో నియోజకవర్గ స్థాయి ప్రొటోకాల్ పదవి లేదు. ఎమ్మెల్యే కేసీఆర్ కావడం, ఎంపీగా రఘునందన్‌రావు బీజేపీ నుంచి ఉన్నారు. జిల్లా మంత్రి పొన్నం ప్రభాకర్, లేదా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ పంపిణీ చేయాల్సి ఉన్నప్పటికీ వారికి సమయం దొరక్క చెక్కుల పంపిణీ ముందుకు సాగడం లేదు. ఇప్పటికే చెక్కులు మంజూరై కార్యాలయంలో సిద్ధంగా ఉన్నప్పటికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి, జిల్లా మంత్రి, గజ్వేల్ ఎమ్మెల్యేగా ఉన్న ప్రతిపక్ష నేత కేసీఆర్, మెదక్ పార్లమెంట్ సభ్యుడు రఘునందన్‌రావు అపాయింట్‌మెంట్ కోసం అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. గజ్వేల్ నియోజకవర్గానికి చెందిన దాదాపుగా 800కు పైగా చెక్కులు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిసింది. సంబంధిత అధికారులు స్పందించి ఈ విషయమై ఎదురుచూస్తున్న లబ్ధిదారులకు చెక్కులను అందజేయాలని వారు కోరుతున్నారు.

అంగన్‌వాడీ చిన్నారులకూ

కంటి పరీక్షలు

ఈ నెల 7వ తేదీ నుంచి ప్రారంభం

0-6 ఏళ్ల పిల్లలందరికీ సామర్థ్య పరీక్షలు

ఆర్‌బీఎస్‌కే బృందాల ద్వారా చిన్నారులకు స్ర్కీనింగ్

కార్యాచరణ రూపొందించిన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ



సంగారెడ్డిలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న ఆర్‌బీఎస్‌కే బృందం (ఫైల్)

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : మొన్నటి వరకు సర్కారు బడి పిల్లలకు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కళ్లద్దాలు పంపిణీ చేసింది సర్కారు. తాజాగా అంగన్‌వాడీ పిల్లలకు కూడా కంటి పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించింది. జిల్లా సంక్షేమ శాఖ పరిధిలోని(ఐసీడీఎస్) అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్యనభ్యసిస్తున్న 0-6 ఏళ్ల మధ్య వయసున్న పిల్లల్లో కంటిచూపు సమస్యలను ముందస్తుగా గుర్తించి అవసరమైన వైద్య సేవలు అందించాలని సంకల్పించింది. ఇందులో భాగంగా వైద్య ఆరోగ్య శాఖ పరిధిలోని ఆర్‌బీఎస్‌కే (రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమం) వైద్య బృందాల ద్వారా కంటి పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ నెల 7న కంటి పరీక్షల స్ర్కీనింగ్ కార్యక్రమం ప్రారంభం కానుంది. ఇందుకు సంబంధించిన కార్యాచరణను వైద్య ఆరోగ్య శాఖ రూపొందించింది.

రోజూ 120 మందికి స్ర్కీనింగ్

వైద్య ఆరోగ్య శాఖ పరిధిలోని ఆర్‌బీఎస్‌కే బృందాలు జిల్లావ్యాప్తంగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లి ఒక్కో బృందం రోజూ 120 మంది పిల్లలకు కంటి పరీక్షలు నిర్వహిస్తారు. తొమ్మిది ఆర్‌బీఎస్‌కే బృందాలతో పాటు సుమారు 12 మంది ఆప్తాల్మిక్ ఆఫీసర్లు ఈ స్ర్కీనింగ్ కార్యక్రమంలో పాల్గొంటారు. ముఖ్యంగా పిల్లల్లో కంటి వ్యాధిగ్రస్తత, కనురెప్ప కిందికి పడిపోయే పరిస్థితి, ఒకే దిశలో కళ్లు చూడలేకపోవడం, కళ్లు నియంత్రించలేని విధంగా కదలడం, కళ్లలో తగినంత తేమ లేకపోవడం, కళ్లు పొడిబారడం, కళ్ల నుంచి నీరు కారడం, కంటిలో ఓవైపు మాంసపు పెరుగుదల, కళ్లపై మచ్చలు, కళ్లు తగినంత తెరవలేకపోవడం, కంటిలో వక్రీభవన లోపాలు.. ఇలా తదితర పరీక్షలు నిర్వహిస్తారు. జిల్లాలో 1,504 అంగన్‌వాడీ కేంద్రాలుండగా, అందులో 0-6 ఏళ్ల వరకు పిల్లలు సుమారు 77,644 వేల మంది ఉన్నారు. వీరందరికీ అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లి కంటి పరీక్షలు చేస్తారు. దృష్టి లోపాలున్న పిల్లలకు వైద్య సేవలందించాలన్నదే ఈ కార్యక్రమ ఉద్దేశ్యమని, సద్వినియోగం చేసుకోవాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులు కోరారు.

కాలిన గాయాలతో చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి

కొండపాక, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : కాలిన గాయాలతో చికిత్స పొందుతూ వృద్ధుడు మృతిచెందిన సంఘటన కొండపాక మండలం అంకిరెడ్డిపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన రుక్కి సాయిలు(72)కు కొద్ది నెలల క్రితం పక్షవాతం బారిన పడడంతో చికిత్స పొందుతూ ఇంట్లోనే ఉంటున్నాడు. మార్చి 16న ఇంట్లో ఎవరు లేని సమయంలో సాయిలు బీడీ తాగుతుండగా ప్రమాదవశాత్తు చెద్దరుకు మంటలు అంటుకొని తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో కుటుంబ సభ్యులు అతడిని చికిత్స నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. కుమారుడు రుక్కి బాల నర్సయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు త్రిటౌన్ పోలీసులు తెలిపారు.

వడ్ల కుప్పను ఢీకొని వ్యక్తి మృతి


రెహమాన్ (ఫైల్)

నిజాంపేట, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): వడ్ల కుప్పను ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం నిజాంపేట మండలంలో జరిగింది. మండల పరిధిలోని నార్లాపూర్ గ్రామానికి చెందిన అబ్దుల్ రెహమాన్(50) గురువారం అర్ధరాత్రి చేగుంట మండలం పులిమామిడికి బయలుదేరాడు. గ్రామ శివారులో రోడ్డుపై ఉన్న వడ్లకు కుప్పలను ఢీకొనడంతో తలకు తీవ్రమైన గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది అక్కడికి చేరుకుని దుబ్బాక ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై శ్రీనివాసరెడ్డి తెలిపారు.

భార్యతో గొడవపడి ఆత్మహత్య

హవేళిఘణపూర్, ఏప్రిల్ 4 : భార్యతో గొడవపడి భర్త ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని హవేళిఘనపూర్ గ్రామానికి చెందిన తాటి నరేశ్(27)కు గురువారం రాత్రి భార్యతో గొడవ జరిగింది. దీంతో ఆవేశంతో గదిలోకి వెళ్లి తలుపులు వేసుకున్నాడు. కుటుంబ సభ్యులు ఇరుగుపొరుగు వారి సాయంతో తలుపులు బద్దలు కొట్టగా.. నరేశ్ ఉరివేసుకుని కనిపించాడు. వెంటనే అతడిని కిందకు దింపి మెదక్ ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందని వైద్యులు తెలిపారు. మృతుడి తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్నట్లు ఏఎస్సై పమియోద్దీన్ తెలిపారు. మృతుడికి భార్య నాగరాణి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

ఒకరిని రక్షించబోయి మరొకరు..

● చెరువులో మునిగి ఇద్దరు గల్లంతు

హత్నూర, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): చెరువులో మునిగి ఇద్దరి యువకులు గల్లంతైన సంఘటన హత్నూర మండల పరిధిలో శుక్రవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం కొండాపూర్ మండలం షాహీపేట గ్రామానికి చెందిన ప్రేమ్‌కుమార్ తన అత్తగారి ఊరైన హత్నూర మండలం బోర్పట్లలో జరుగుతున్న మల్లికార్జున స్వామి ఉత్సవాలకు భార్య పిల్లలతో కలిసి వచ్చాడు. శుక్రవారం మధ్యాహ్నం స్నానానికని ప్రేమ్‌కుమార్ గ్రామ సమీపంలోని భీముడిని చెరువులోకి దిగి ఎంతసేపటికి పైకి రాలేదు. దీంతో బోర్పట్ల గ్రామానికి చెందిన డప్పు నవీన్‌కుమార్, మరికొందరు చెరువు వద్దకు చేరుకొని నీటిలోకి దిగి గాలిస్తుండగా నవీన్‌కుమార్ కూడా గల్లంతయ్యాడు. దీంతో గ్రామస్థులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. సమాచారం అందుకున్న తహసీల్దార్ ఫర్హీన్ షేక్, ఎంపీడీవో శంకర్, ఎస్‌ఐ సుభాష్, ఆర్‌ఐ శ్రీనివాస్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. రెస్క్యూ టీంలను రప్పించి గాలింపు చర్యలు చేపట్టారు. రాత్రి వరకు గాలించినా వారి ఆచూకీ లభించలేదు. చెరువు వద్ద గల్లంతయిన వారి కుటుంబసభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి.

అక్రమ బియ్యం తరలింపు కేసులో

ఐదుగురు అరెస్టు

మెదక్ అర్బన్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): మెదక్ పట్టణంలోని కేంద్ర గిడ్డంగుల సంస్థ(సీడబ్ల్యూసీ) గోదాము నుంచి అక్రమంగా బియ్యం తరలింపు కేసులో ఐదుగురిని అరెస్టు చేసినట్లు పట్టణ సీఐ నాగరాజు తెలిపారు. గత నెల 31న సీడబ్ల్యూసీ గోడౌన్ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా 35 క్వింటాళ్ల ఎఫ్‌సీఐ బియ్యాన్ని డీసీఎంలో తరలిస్తుండగా.. స్థానికుల సాయంతో పోలీసులు పట్టుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. శుక్రవారం సీడబ్ల్యూసీ మేనేజర్ కోటేశ్వర్‌రావు, ఎగ్జిక్యూటివ్ సునీల్, టెక్నికల్ శ్యామ్‌లతోపాటు డ్రైవర్ భానుచందర్, వ్యాపారి సంతోష్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా.. నేరాన్ని అంగీకరించారు. దాంతో సీడబ్ల్యూసీ ఉద్యోగులతోపాటు మరో ఇద్దరి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

మేనేజర్ సస్పెండ్!

మెదక్ సీడబ్ల్యూసీలో మేనేజర్‌గా పని చేస్తున్న కోటేశ్వర్‌రావును సంస్థ సస్పెండ్ చేసి, ఆయన స్థానంలో మచిలీపట్నంలో విధులు నిర్వహిస్తున్న భాగ్యరాజ్‌ను నియమించగా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.

విద్యుత్ వైర్లు తగిలి వ్యక్తికి గాయాలు

శివ్వంపేట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ షాక్ తో వ్యక్తికి గాయాలైన ఘటన మండల కేంద్రమైన శివ్వంపేటలో శుక్రవారం చోటుచేసుకుంది. గుజరాత్ రాష్ట్రం సూరత్‌కు చెందిన ప్రకాష్ ఆరు నెలల క్రితం శివ్వంపేటలో షాపు అద్దెకు తీసుకొని ప్లైవుడ్ షాపు పెట్టగా శుక్రవారం షాపు ఖాళీ చేశాడు. పైన ఉన్న విద్యుత్ వైర్లను గమనించకుండా పైపులు ఆటోలో వేస్తుండగా అవి విద్యుత్ వైర్లకు తగిలి కాలు చెయ్యికి గాయాలయ్యాయి. వెంటనే బంధువులు అతడిని ఆస్పత్రికి తరలించారు.

సహజీవనానికి నిరాకరించిందని హత్య

జహీరాబాద్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): వారు కొంత కాలంగా సహజీవనం చేస్తున్నారు. అతని పద్ధతి నచ్చకపోవడంతో ఆమె దూరం పెట్టింది. దీంతో కోపం పెంచుకున్న అతను ఆమెను గ్యాస్ సిలిండర్ తలపై మోది హత్య చేశాడు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లోని పస్తాపూర్‌లో మార్చి 30న జరిగిన మేతరి లక్ష్మి(45) హత్య కేసును పోలీసులు చేధించారు. ఆమెతో సహజీవనం చేసిన వ్యక్తే చంపిసేనట్లు తేల్చారు. శుక్రవారం నిందితుడిని అరెస్ట్ చేసి, కోర్టులో హాజరు పరిచారు. జహీరాబాద్ డీఎస్పీ రామ్మోహనరెడ్డి కేసు వివరాలను వెల్లడించారు. కోహీర్ మండలంలోని గొటిగార్‌పల్లికి చెందిన సత్యారం రమేష్ అలియాస్ రవి, ఝరాసంగం మండలంలోని చీలమామిడి గ్రామానికి చెందిన మ్యాతరి లక్ష్మి పస్తాపూర్‌లో ఉంటూ సహజీవనం చేసేవారు. రవి ప్రవర్తన నచ్చక ఆమె అతడిని దూరం పెట్టింది. దీంతో కోపం పెంచుకున్న రవి మార్చి 29న జహీరాబాద్‌లోని కల్లు కంపౌండ్ వద్ద హత్య చేయడానికి ప్రయత్నించగా, కొందరు అడ్డు పడటంతో కుదరలేదు. దీంతో మార్చి 31న ఆమె ఇంటికి వచ్చాడు. అప్పటికే అతనిపై ఆగ్రహంతో ఉన్న ఆమె రవితో గొడవ పడింది. అతని కంట్లో కారంపొడి చల్లింది. ఈ క్రమంలో నిందితుడు పక్కనే ఉన్న 5 కిలోల గ్యాస్ సిలిండర్ తీసుకుని లక్ష్మి తలపై బలంగా కొట్టాడు. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు శుక్రవారం నిందితుడిని అరెస్ట్ చేశారు. ఈ సమావేశంలో పట్టణ సీఐ శివలింగం, ఎస్సై కాశీనాథ్, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ హాస్టల్ విద్యార్థి అదృశ్యం

● వార్డెన్ నిర్లక్ష్యమే కారణమంటూ ఆందోళన

వట్‌పల్లి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): హాస్టల్ విద్యార్థి అదృశ్యమైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వట్‌పల్లి ఏఎస్‌ఐ సుధాకర్ కథనం ప్రకారం.. రేగోడు మండలం పెద్దతండాకు చెందిన కుమార్ వట్‌పల్లి మండలం దేవనూర్‌లోని ఎస్సీ హాస్టల్లో ఉంటూ అదే గ్రామంలోని ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. గత నెల 20 వరకు పాఠశాలకు వచ్చిన విద్యార్థి 21వ తేదీ నుంచి రావడం లేదు. ఉగాది పండుగ సెలవులకూ ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు వార్డెన్‌కు ఫోన్ చేసి అడగగా, అందరు విద్యార్థులతో పాటు కుమార్ ఇంటికి బయలుదేరాడని వార్డెన్ రాజిరెడ్డి సమాధానమిచ్చాడు. బంధుమిత్రుల వద్ద వెతికినా ఆచూకీ లభించకపోవడంతో వారు శుక్రవారం హాస్టల్‌కు చేరుకుని, వార్డెన్‌ను నిలదీశారు. తాను కూడా వెతుకుతున్నానని, ఆచూకీ లభించకపోతే తన తప్పేమిటని వార్డెన్ నిర్లక్ష్యంగా తల్లిదండ్రులకు మాట్లాడాడు. దీంతో ఆగ్రహానికి గురైన తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ మఠం చంద్రశేఖర్, దివ్యాంగుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సుభాష్ హాస్టల్‌కు చేరుకుని విద్యార్థులతో కలిసి ధర్నా చేశారు. పలు సంఘాల నాయకులు సంఘీభావం తెలిపారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నామని ఏఎస్‌ఐ తెలిపారు. జోగిపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అనిల్ హాస్టల్‌కు చేరుకుని వార్డెన్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నారు.

లారీని ఢీకొట్టిన డీసీఎం

● క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డీసీఎం డ్రైవర్


గాయపడిన డీసీఎం డ్రైవర్

తూప్రాన్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): తూప్రాన్ మండలం నాగులపల్లి శివారులో 44వ జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదం జరిగింది. దీంతో డీసీఎం క్యాబిన్‌లో ఇరుక్కుపోయి డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. తూప్రాన్ మండలం నాగులపల్లి శివారులో కాఫీడే సమీపంలో 44వ జాతీయ రహదారిపై తూప్రాన్ వైపు నుంచి కామారెడ్డి వైపు వెళుతున్న డీసీఎం వాహనం ముందుగా వెళుతున్న కంటైనర్ లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డీసీఎం డ్రైవర్ కర్ణాటక రాష్ట్రానికి చెందిన కబ్రెజ్(36) తీవ్రంగా గాయపడ్డాడు. డీసీఎం వాహన క్యాబిన్‌లో ఇరుక్కుపోగా అటుగా వెళ్లే వాహనదారులు, ప్రజలు అతికష్టమీద బయటకు తీశారు. కాలుపూర్తిగా నుజ్జునుజ్జు కావడంతో సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించారు.

మన వల్లే ప్రకృతి విపత్తులు

జీవవైవిధ్యం అవసరం.. ముగిసిన జాతీయ సదస్సు
పరిశోధనా పత్రాలు సమర్పించిన విద్యార్థులు

సిద్దిపేట కల్చరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రకృతిని చేజేతులా నాశనం చేస్తున్నామని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేశారు. మనం వాడే పెయిన్‌కిల్లర్ ట్యాబెట్ వల్ల రాబందుల జాతి అంతమైపోయే దశకు చేరిందని ఒకరు.. మానవ తప్పిదాల వల్లే ప్రకృతి విపత్తులు తెలుత్తున్నాయని మరొకరు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రకృతిని, అరుదైన పక్షులను, జంతుజాలాన్ని కాపాడుకోవాల్సిన అవశ్యకతను వివరించారు. ఈ మేరకు వారు తమ పరిశోధనా పత్రాలను సమర్పించారు. ఇండియన్ కౌన్సిల్ ఫర్ సోషల్ సైన్సెస్ రీసెర్చ్ (ఐసీఎస్ఎస్ఆర్) ఆర్థిక సహకారంతో సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల ఐ.క్యూఏసీ, రాజనీతిశాస్త్ర విభాగం, జువాలజీ విభాగం సంయుక్తంగా నిర్వహిస్తున్న రెండు రోజుల జాతీయ సదస్సు శుక్రవారం ముగిసింది. 'వికసిత్ భారత్-2047 లక్ష్యాలు, పర్యావరణ సమగ్ర అభివృద్ధి' అంశంపై సదస్సు రెండురోజుల పాటు చర్చ కొనసాగింది. వివిధ రాష్ర్టాల నుంచి వచ్చిన పరిశోధక విద్యార్థులు పరిశోధన పత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా వాల్‌పోస్టర్ ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఇందిరానగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివే 9వ తరగతి విద్యార్థిని శ్రేష్ఠ పర్యావరణం గురించి ప్రజెంట్ చేసిన పోస్టర్ ఆకట్టుకుంది. శుక్రవారం జరిగిన ముగింపు సమావేశంలో వరల్డ్ వైల్డ్‌లైఫ్ ఫండ్ స్టేట్ డైరెక్టర్ పరిధా తంపాల, హైదరాబాద్(ఎన్ఆర్ఎస్ఈ) నేషనల్ రిమోట్ సెన్సింగ్ సీనియర్ సైంటిస్ట్ డా.సి. సుధాకర్‌రెడ్డి, అన్నామలై విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ టి రామనాథన్, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి. సునీత మాట్లాడారు. కార్యక్రమంలో సదస్సు కన్వీనర్లు డా. ఎన్ హరిబాబు, పి. అయోధ్య రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ సిహెచ్ మధుసూదన్, అధ్యాపకులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వక్త



జాతీయ సదస్సు సందర్భంగా రూపొందించిన వాల్ పోస్టర్

మానవ తప్పిదాల వల్లనే..



నేను ఎంఎస్సీ ఎన్విరామెంటల్ సైన్స్ చేస్తున్నాను. ఎవల్యూటింగ్ ద ఫ్రాగ్మంటేషన్ అండ్ కనెక్టివిటీ ఆఫ్ మ్యాంగ్రోవ్ ఈకో సిస్టమ్ అండమాన్, నికోబార్ ఐలాండ్స్ అనే అంశంపై పరిశోధన రీసెర్చ్ పేపర్ ప్రజెంట్ చేశాను. ప్రకృతి విపత్తులను తట్టుకోవడానికి సహజంగా నేచర్ ఒక సిస్టమ్ ఉంటుంది. ఆ సిస్టంను మానవ తప్పిదాల వల్ల నాశనం చేసినప్పుడు ప్రకృతి చేసే వికయతాండవానికి ఎక్కువ నష్టం వాటిల్లుతుంది. అలాంటివే మ్యాన్‌గ్రూస్ ఫారెస్ట్‌లు. ఇవి ఎక్కువగా సముద్ర తీర ప్రాంతాల్లో సహజ సిద్ధంగా ఏర్పడతాయి. వీటి వల్ల ప్రకృతి విపత్తులైన సునామీ వంటిని అడ్డుకోవచ్చు. మేం అండమాన్ ప్రాంతంలోని మ్యాన్‌గ్రూస్‌పై రీసెర్చ్ చేసినప్పుడు 616 స్క్వేర్ కిలోమీటర్ల మేర ఈ మ్యాన్‌గ్రూస్ వ్యాపించి ఉండేవని, 2023లో సునామి వచ్చినప్పుడు ఒక వంద స్క్వేర్ కిలోమీటర్ల పరిధి దెబ్బతిన్నట్లు రీమోట్ సెన్సింగ్ ద్వారా తెలుసుకున్నాం. వీటి పట్ల నిర్లక్ష్యం వహిస్తే మరో 100 స్క్వేర్ కిలోమీటర్ల పరిధి కోల్పోయే ప్రమాదముంది. మానవ తప్పిదాల వల్ల మ్యాన్‌గ్రూస్ ఫారెస్ట్‌లను తొలగించినట్లయితే చాలా ఇబ్బందులు పడాల్సి వస్తుంది. వీటి పరిరక్షణకు చర్యలు చేపట్టాలి.

విజయ లక్ష్మి, భారతీదాసన్ యూనివర్సిటీ, తిరుచ్చి, తమిళనాడు

అరుదైన పక్షి జాతులు అంతరించిపోతున్నాయి



నేను కేరళ డిజిటల్ యూనివర్సిటీలో మాస్టర్స్ ఇన్ ఎకాలజీ చదువుతున్నాను. ఇక్కడ జరుగుతున్న నేషనల్ సెమినార్‌లో ప్రిడిక్టింగ్ కీ హబిటాట్స్ ఫర్ కన్వజరేషన్ అండ్ ఎండోమిక్ త్రెట్టన్ బర్డ్స్ స్పెసిస్ అనే అంశంపై పరిశోధనపత్రం సమర్పించాను. ప్రస్తుతం సమాజంలో చాలా వరకు జాతులు అంతరించిపోతున్నాయి. అలాంటి వాటిలో వల్చర్ (భారత రాబందు), సన్‌బర్డ్ అనే పక్షి జాతులు అంతరించిపోయే ప్రమాదంలో ఉన్నాయి. పశ్చిమ కనుమలలో ఎక్కువగా కనిపించే ఈ రెండు జాతులు గుజరాత్, కేరళలో ఎక్కువగా ఉంటాయి. రానూ రానూ ఈ రెండు జాతులు అంతరించే పోయే పరిస్థితి వచ్చింది. ఇప్పటికే 90 శాతం పక్షులు కనుమరుగయ్యాయని మా పరిశోధనలో తెలింది. ఈ పక్షుల వల్ల ప్రకృతికి ఎలాంటి హనీ లేకపోగా మంచి జరుగుతుంది. చనిపోయిన మనుషుల, జంతువుల కళేబరాలు తినే రాబందు అంతరించడానికి ప్రధాన కారణం మనం తరుచుగా వాడే డైక్లోపేనిక్ అనే టాబ్లెట్, ఇంజక్షన్ వల్ల చనిపోతున్నాయని తెలిస్తే ఆశ్చర్యం కలుగుతుంది. కానీ వాస్తవం. సాధరణంగా డైక్లోపేనిక్‌ను పెయిన్‌కిల్లర్‌గా వాడుతారు. అలా వాడిన కళేబరాలను తినటం వలన రాబందులు చనిపోతున్నాయని రీసెర్చ్ వల్ల తెలుసుకోగలిగాం. ప్రభుత్వాలు చర్యలు చేపట్టకపోతే ఈ రెండు జాతులను భవిష్యత్‌లో చూడలేమనేది వాస్తవం. పెయిన్ కిల్లర్ల వాడకం గురించి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

- గోనుగుంట్ల ప్రణతి, అనంతపూర్, ఆంధ్రప్రదేశ్

నేల నిస్సారం చేసే లాంటినా కెమెరా



ఐడెంటిఫైయింగ్ ఇన్విషన్ హట్‌స్పాట్స్ ఆఫ్ లాంటినా కెమెరా ఇన్ ప్రొడెక్టెడ్ ఎరియాస్ ఆఫ్ వెస్టర్న్ గార్డ్స్ అనే అంశంపై రీసెర్చ్ పేపర్ ప్రజెంట్ చేశాను. చాలా రకాల మొక్కలు నేలకు మంచి చేస్తాయి. కానీ, కొన్ని మాత్రం భూసారాన్ని తగ్గించి హనీ చేస్తాయి. అలాంటి మొక్కనే లాంటినా కెమెరా (తలంబ్రాల చెట్టు) ఈ చెట్టు అమెరికా దేశానికి చెందిన మొక్క. కానీ ఇది దేశంలో చాలా చోట్ల విరివిగా పెరుగుతుంది. అయితే దీనివల్ల నేలకు హనీ కలుగుతుందని పరిశోధనలో వెల్లడైంది. ఈ మొక్క పెరిగిన చోట వేరే ఇతర మొక్కలు పెరిగే అవకాశం ఉండదు. వేర్లు భూమిలోకి పాతుకుపోయి నేలలోని సారాన్ని పీల్చివేస్తాయి. ఇలాంటి సమస్యలను మొదటనే అరికట్టగలిగితే భూసారాన్ని కాపాడుకున్నవాళ్లమవుతాం. లేదంటే చాలా సమస్యలు ఉత్పన్నమవుతాయి. ఈ చెట్లను కొట్టివేయకుండా వేర్ల నుంచి తీసివేస్తేనే మళ్లీ పెరగకుండా ఉంటాయి.

-అమిత్తు జేఎస్, త్రివేండ్రం, కేరళ

ఉపయోగకరమైన బ్యాక్టీరియాతో ఆక్వా కల్చర్



నేను సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ, పీజి కళాశాలలో చదివాను. ప్రస్తుతం అన్నామలై యూనివర్సిటీలో జినోమిక్ ల్యాబ్‌లో రీసెర్చ్ స్కాలర్‌గా ఉన్నాను. ఈ సెమినార్‌లో ద డ్యూయల్ రోల్ ఆఫ్ వైబ్రియన్ స్పెసెస్ ఇన్ ఆక్వాకల్చర్ అనే అంశంపై పరిశోధన పత్రం సమర్పించాను. ఆక్వా కల్చర్‌లో సాధరణంగా రైతులు పర్టిలైజర్స్, యాంటి బయాటిక్స్ ఎక్కువగా వాడుతుంటారు. వాటి వాడకం వలన చాలా ఇబ్బందులు వస్తాయి. వైబ్రియన్ అనే బ్యాక్టీరియాలోని ఉపయోగకరమైన దాన్ని ఆక్వా కల్చర్‌లో ఉపయోగించటం ద్వారా మంచి ఫలితాలు వస్తాయి. ఇందుకోసం ఆంధ్రాలోని భీమవరం, తమిళనాడులోని నాగపట్నంలో పరిశోధనలు కొనసాగించాం.

జి. ధనుష్, అన్నామలై యూనివర్సిటీ, తమిళనాడు

రాములోరికి వెండికిరీటాలు
బహూకరించిన అజ్ఞాత భక్తులు



అజ్ఞాత భక్తులు అందజేసిన కిరీటాలు

నారాయణఖేడ్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చారిత్రాత్మకమైన రామాలయంలోని రామ, లక్ష్మణ, భరతుడితోపాటు హన్మంతుడికి అజ్ఞాత భక్తులు శుక్రవారం వెండి కిరిటాలను బహూకరించారు. శుక్రవారం ఆలయానికి వచ్చిన కొందరు ఆలయ ప్రతినిధులకు వెండి కిరీటాలు అందించారు. అయితే, తమ పేర్లు బయటపెట్టవద్దని కోరారు. దీంతో ఆలయ కమిటీ వారు అజ్ఞాత భక్తులను అభినందించారు.

సీతారాముల కల్యాణానికి ముస్లింలకు ఆహ్వానం



పోలీసుల సమక్షంలో కల్యాణ ఆహ్వానపత్రిక అందజేస్తున్న ప్రతినిధులు

కుకునూరుపల్లి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో జరిగే సీతారాముల కల్యాణానికి హాజరుకావాలని నిర్వాహకులు ముస్లింలకు ఆహ్వానపత్రిక అందజేశారు. ఇందుకు కుకునూరుపల్లి పోలీస్‌స్టేషన్ వేదికగా మారింది. శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై శ్రీనివాస్ ఆధ్వర్యంలో పీస్ కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ లతీఫ్ మాట్లాడుతూ మతం పేరుతో విబేధాలు వద్దని, అన్ని మతాలు సమానమేనని, పండుగలు శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. హిందూ ముస్లిం ప్రతినిధులు మాట్లాడుతూ గ్రామంలో అంతా కలిసి మెలిసి ఉంటామని, తమ మధ్య విబేధాలు లేవని అన్నారు. ఈ క్రమంలో శ్రీరామ కల్యాణ నిర్వాహకులు స్వామి వారి కల్యాణానికి రావాలని కోరుతూ ఆహ్వానపత్రికను అందజేశారు. కార్యక్రమంలో ఎస్సై శ్రీనివాస్, పోలీస్ సిబ్బంది, పీస్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

భాషాసంస్కృతుల పరిరక్షణకు కృషి చేసిన యశోదారెడ్డి

సిద్దిపేట కల్చరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఆధునిక సాహిత్యంలో తెలంగాణ భాషాసంస్కృతుల పరిరక్షణ కోసం కృషిచేసిన వారిలో యశోదారెడ్డి ముందువరుసలో ఉంటారని గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు శాఖ అధ్యక్షులు డాక్టర్ రాజిరెడ్డి మహేందర్‌రెడ్డి అన్నారు. సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీకళాశాల తెలుగుశాఖ ఆధ్వర్యంలో ఆచార్య యశోదారెడ్డి కథాసాహిత్యంపై శుక్రవారం విస్తృతోపన్యాస కార్యాక్రమం నిర్వహించారు. సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగుశాఖ అధ్యక్షుడు డా. మట్టా సంపత్‌కుమార్ రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ జి. సునీత, తెలుగుశాఖ అధ్యాపకులు పిట్ల దాసు, నారోజు వెంకటరమణ, నరేశ్, శైలజ, సంపత్ కుమార్, రామస్వామి, నర్సింహులు, సాయిసురేశ్ పాల్గొన్నారు.

విద్యార్థులను తీర్చిదిద్దాలి
జేఎన్టీయూను సందర్శించిన వీసీ

పుల్‌కల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): చౌటకూర్ మండలం సుల్తాన్‌పూర్ జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలను వీసీ ప్రొఫెసర్ కిషన్‌కుమార్‌రెడ్డి శుక్రవారం సందర్శించారు. జేఎన్టీయూ హైదరాబాద్ వీసీగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన తొలిసారిగా సుల్తాన్‌పూర్ జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల, ఫార్మసీ కళాశాలను సందర్శించారు. కళాశాలలోని వివిధ భాగాలలో కలియ తిరుగుతూ సౌకర్యాలను ప్రిన్సిపాల్ నరసింహను అడిగి తెలుసుకున్నారు. కళాశాలలో సైన్స్, కంప్యూటర్ ల్యాబ్‌లు, గ్రంథాలయం తదితర వాటి గురించి ఆరా తీశారు. సువిశాల విస్తీర్ణంలో వసతి గృహ సముదాయాలు, తరగతి గదుల సముదాయాలు బాగున్నాయంటూ సంతృప్తిని వ్యక్తం చేశారు. విశాలమైన రహదారులు, ఆధునాతన విధానంతో కళాశాలను తీర్చిదిద్దిన తీరును ఆయన ప్రశంసించారు. అనంతరం అధ్యాపకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. జేఎన్టీయూకు మంచి పేరు ఉందని, ఆ బ్రాండ్‌కు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దాల్సిన బాధ్యత అధ్యాపకులపై ఆధారపడి ఉందన్నారు. పరిపాలన భవనంలో ప్రతిష్ఠించిన శ్రీ సరస్వతీ మాతను ఆయన దర్శించుకున్నారు. ముందుగా వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కిషన్‌కుమార్‌రెడ్డికి ప్రిన్సిపాల్ జి.నరసింహ పుష్పగుచ్చం అందజేసి స్వాగతం పలికారు.



జేఎన్టీయూ వీసీ కిషన్‌కుమార్‌రెడ్డికి భూమి పత్రాలను అందజేస్తున్న ఆర్డీవో పాండు

ఫార్మసీ కళాశాలకు 15 ఎకరాలు

అందోలు శివారు సర్వే నంబర్ 1,141లో గల 15 ఎకరాల భూమి పత్రాలను ఆర్డీవో పాండు జేఎన్టీయూ హైదరాబాద్ వీసీ ప్రొఫెసర్ కిషన్‌కుమార్‌రెడ్డికి శుక్రవారం అందజేశారు. మంత్రి దామోదర్ రాజనరసింహ ప్రత్యేక చొరవతో ఫార్మసీ కళాశాలను మంజూరు చేశారు. ఈ కళాశాల నిర్మాణానికి అవసరమైన అందోలు శివారులోని సర్వే నంబర్ 1,141లో 15 ఎకరాల భూమిని కేటాయించారు. గడిచిన మూడేళ్లుగా ఫార్మసీ కళాశాల జేఎన్టీయూ కళాశాలలో కొనసాగుతున్నది. ఫార్మసీ కళాశాలకు కేటాయించిన భూమిని జేఎన్టీయూ చీఫ్ ఇంజనీర్ శ్రీనివాసులు, ప్రిన్సిపాల్ జి.నరసింహ, సునీతారెడ్డిలు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రాఘవేందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



పిడుగు పడి చీలిన చెట్టు

శివ్వంపేట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): పిడుగుపాటుకు రైతు పంట పొలంలో చెట్టు చీలిపోయిన సంఘటన మండలంలోని దొంతి గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. మండల పరిధిలోని దొంతి గ్రామంలో గురువారం ఉరుములు మెరుపులతో వర్షం కురిసింది. ఇదే సమయంలో గ్రామానికి చెందిన లింగారెడ్డి పొలం దగ్గర వేప చెట్టుపై పిడుగు పడటంతో చెట్టు చీలిపోయింది. ఆ సమయంలో పొలం దగ్గర ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

ఐఐటీ-హెచ్ సహకారంతో చెత్త సమస్యకు చెక్



డంపుయార్డును పరిశీలిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి

కంది, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): కందిలో ఎన్నాళ్ల నుంచో వేదిస్తున్న చెత్త సమస్యకు ఐఐటీ-హెచ్ సహకారంతో చెక్ పడనుందని జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబా అన్నారు. మండలకేంద్రమైన కందిలోని రిజిస్ట్రేషన్ కార్యాలయ ఆవరణలోని చెత్త డంపును శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సాయిబాబా మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ కార్యాలయ ఉద్యోగులకు, మైనారిటీ పాఠశాల విద్యార్థులకు, డబుల్ బెడ్‌రూంలలో నివాసం ఉంటున్న వారికి దుర్వాసన రాకుండా, ఎలాంటి ఇబ్బంది కలగకుండా చెత్త డంపును శుభ్రం చేయాలని ఆదేశించారు. సెగ్రికేషన్ షెడ్ వద్ద తడి-పొడి చెత్తను సరిగా వేరు చేయడంలేదని మండిపడ్డారు. తడి-పొడి చెత్తను వేరు చేయకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే తడి-పొడి చెత్త సేకరణ కచ్చితంగా అమలయ్యేలా చూడాలన్నారు. కందిలో చెత్త రీసైక్లింగ్ ప్లాంటుకు ఏర్పాటుకు ఐఐటీహెచ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని పేర్కొన్నారు. ఇందుకోసం వెంటనే ఒక ఎకరం స్థలం కేటాయించడానికి సన్నాహాలు చేస్తున్నామని సాయిబాబా పేర్కొన్నారు. భూమి సేకరణ పూర్తయిన వెంటనే చెత్త రీసైక్లింగ్ ప్లాంటును ఏర్పాటు చేస్తామన్నారు. ఆయన వెంట డీఎల్‌పీవో అనిత, ఎంపీవో మహేందర్ రెడ్డి, కార్యదర్శి విద్యాధర్, పంచాయతీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

వైభవంగా శ్రీకాలభైరవ విగ్రహ ప్రతిష్ఠాపన
హాజరైన పీఠాధిపతులు



ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపన పూజా కార్యక్రమంలో పీఠాధిపతులు

రాయికోడ్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ధర్మాపూర్‌లో వెలసిన శ్రీలలిత కోటి పార్థీవ లింగస్థాన దేవస్థానంలో శ్రీకాలభైరవ ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపన ఉత్సవాలు శుక్రవారం వైభవంగా జరిగాయి. ఈ ఉత్సవాలకు బర్దీపూర్ దత్తగిరి మహారాజ్ ఆశ్రమ పీఠాధిపతి డాక్టర్ సిద్దేశ్వర మహారాజ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పంచవటి కాశీనాథ్, బసవలింగ అవదూత గిరి మహారాజ్, వీరేశ్వర శివాచార్య మహాస్వామిజీ, హిందూ ఆశ్రమ పీఠాధిపతి చిన్న మల్లికార్జునస్వామి, రాచయ్యస్వామి తదితరులు హాజరయ్యారు. దేవాలయంలో గణపతిపూజ, గోపూజ, రుద్రాభిషేకం, అనంతరం వేద బ్రాహ్మణులు ఉదయం శ్రీ కాలభైరవ, ధ్వజస్తంభం విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పీఠాధిపతులు మాట్లాడుతూ దేశంలో విభిన్న సంస్కృతుల నిలయమని, అన్ని మతాలు, కులాలు, వర్గాల సమష్టి కలయిక అని, వీటిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రతి ఒక్కరూ భక్తి మార్గంలో నడుచుకోవాలని పిలుపునిచ్చారు. భగవత్ నామస్మరణతోనే మనిషికి ప్రశాంతత లభిస్తుందని తెలిపారు. తల్లిదండ్రులు, గురువులు చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో దేవస్థాన వ్యవస్థాపకులు ఎస్‌కే పాటిల్, దేవాలయ కమిటీ అధ్యక్షులు నేతి జ్ఞానేశ్వర్, తాజామాజీ జెడ్పీటీసీ మల్లికార్జున్‌పాటిల్ వీరభద్రేశ్వర్, ఆలయ కమిటీ బాధ్యులు, భక్తులు తదితరులు ఉన్నారు. కార్యక్రమానికి పెద్ద ఎత్తున భక్తులు హాజరయ్యారు.

సంకల్పానికి.. విధి చేతులెత్తింది!

నాలుగేళ్లకే కంటి చూపు కోల్పోయినా..
పట్టుదలతో పీజీ పూర్తి
ప్రభుత్వ లెక్చరర్‌గా ఉద్యోగం..
ఇప్పటికే రెండు పుస్తకాల రచన




జీవనస్రవంతి ఆవిష్కరణలో నందిని సిద్దారెడ్డి, నాళేశ్వరం శంకర్ తదితరులు

మెదక్ కల్చరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): పుట్టిన నాలుగేళ్లకు కళ్ల కలక వస్తే.. పసరు మందు వేశారు. దీంతో రెండు కళ్లు కనిపించకుండా పోయాయి. 'కళ్లు కనిపించవు.. ఇక వాడు ఏం చేయగలుగుతాడు' అంటూ చుట్టుపక్కల వారు ఎగతాళి చేశారు. సూటిపోటి మాటలు అనే వారు. అవే ఆయనలో కసిని పెంచాయి. జీవితంలో విజయం సాధించడమే వారికి తానిచ్చే సమాధానం అనుకున్నారు ఆయన. చదువుకుని మంచి ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో ప్రభుత్వ లెక్చరర్‌గా ఉద్యోగం సాధించి ఔరా అనిపించారు. అంతటితో ఆగకుండా రచనావ్యాసంగాన్ని చేపట్టి పుస్తకాలు రాశారు విశ్రాంత అధ్యాపకులు గోపాల్. ఇప్పటికే రెండు పుస్తకాలు రాసిన ఆయన 70 ఏళ్ల వయస్సులో మరో పుస్తక రచనకు పూనుకున్నారు.

చూపులేదనే కలత చెందకుండా..

ప్రస్తుత కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట మండలం, పోచారం గ్రామంలో పుట్టిన గోపాల్‌కు నాలుగేళ్ల వయస్సులో కండ్ల కలక రావడంతో పసరు మందు వాడారు. దీంతో ఆయన రెండు కళ్లు కనిపించకుండా పోయాయి. అయితే, చూపులేదనే కలత చెందకుండా చదువుకుంటానని ఇంట్లో వాళ్లకు చెప్పారు. వారు హైదరాబాద్ మలక్‌పేటలోని అంధుల పాఠశాలలో చేర్పించారు. కొన్నాళ్లకే తండ్రి కాలం చేశారు. అయినా, అక్కడే ఉండి ఉస్మానియా వర్సిటీ నుంచి డిగ్రీ, పీజీ పూర్తి చేశారు. 1978లో వనపర్తి ప్రభుత్వ పాఠశాలలో జూనియర్ లెక్చరర్‌గా ఉద్యోగం సాధించారు. కొన్నాళ్ల తర్వాత బదిలీపై సిద్దిపేట ప్రభుత్వ కళాశాలలో పనిచేశారు. తర్వాత మెదక్ బాలుర జూనియర్ కళాశాలలో కొన్నాళ్లు పని చేసిన అనంతరం పదోన్నతిపై సిద్దిపేట డిగ్రీ కళాశాలకు వెళ్లారు. అక్కడినుండే ఉద్యోగ విరమణ చేసారు.



గోపాల్ రచించిన పుస్తకం

సాహిత్యంపై ప్రేమ

సాహిత్యంపై ప్రేమతో తెలంగాణ రచయితల సంఘం సభ్యుల్లో ఒకరుగా నిలిచారు గోపాల్. నందిని సిద్దారెడ్డితో కలిసి చదువుకున్నారు. జీవన స్రవంతి అనే పుస్తకాన్ని రెండు భాగాలుగా రచించారు. సిద్ధారెడ్డి సలహాలతోనే ఈ రెండు పుస్తకాలు రచించినట్టు గోపాల్ అంటారు. జీవన స్రవంతి మొదటి భాగాన్ని సిద్దిపేటలో పోచారం గ్రామంలో ఆవిష్కరించారు. రెండో భాగం ఇటీవలే మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వేదికగా ఆవిష్కరించారు.

కళ్లు లేకున్నా.. నిరుత్సాహ పడలేదు



కళ్లు కనపించకున్నా.. ఏనాడూ నిరుత్సాహ పడలేదు. అంగవైకల్యం అనేది లక్ష్యాన్ని ఏమాత్రం ప్రభావం చేయలేదు. నాలుగేళ్ల వయస్సులోనే కళ్లు కనిపిచకుండా పోయినా చదువు పై దృష్టి సారించాను. ఈ ప్రయాణంలో నా కుటుంబ సభ్యులు, మిత్రుడు నందిని సిద్దారెడ్డి ఎంతో తోడ్పాటును అందించారు. ఇప్పటికే ఇతరుల సహాయంతో నా భావాలతో రెండు పుస్తకాలు రచించాను. ఇంకొక పుస్తక రచనకు పూనుకున్నాను.

గోపాల్, విశ్రాంత డిగ్రీ కళాశాల లెక్చరర్

సజావుగా సన్న బియ్యం పంపిణీ

● సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి


కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి రూరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : సన్న బియ్యం పంపిణీ ప్రక్రియ పూర్తి పారదర్శకంగా జరిగేలా చూడాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి తెలిపారు. హైదరాబాద్ నుంచి శుక్రవారం కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. అనంతరం సంగారెడ్డి జిల్లా నుంచి కలెక్టర్ వల్లూరు క్రాంతి మాట్లాడుతూ జిల్లాలో సన్న బియ్యం పంపిణీ సజావుగా కొనసాగుతోందని, నాణ్యమైన బియ్యాన్ని ఉచితంగా అందించడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నామని సీఎస్‌కు తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ మాధురి, పౌరసరఫరాల శాఖ జిల్లా అధికారి శ్రీనివాస్ రెడ్డి, మేనేజర్ అంబదాస్ రాజేశ్వర్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు. కాగా, డా.బాబు జగ్జీవన్‌రామ్ 117వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

విద్యార్థుల నమోదు పెంచే బాధ్యత హెచ్‌ఎంలదే : సంగారెడ్డి డీఈవో


మాట్లాడుతున్న డీఈవో వెంకటేశ్వర్లు

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచాల్సిన బాధ్యత ప్రధానోపాధ్యాయులదేనని డీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు. సంగారెడ్డిలోని జిల్లా సైన్స్ సెంటర్‌లో ఇటీవల పీఎస్‌హెచ్‌ఎంలుగా పదోన్నతి పొందిన సందర్భంగా ఆ టీచర్లకు నిర్వహించిన రెండు రోజుల శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పాఠశాల నివాస ప్రాంతాల్లోని విద్యార్థులను బడుల్లో చేర్పించాలన్నారు. కార్యక్రమంలో కోర్సు డైరెక్టర్ అనురాధ, జిల్లా రీసోర్స్ పర్సన్లు రాంచందర్, బస్వయ్య, జనార్దన్, జిల్లా అకాడమిక్ అధికారి బాలయ్య, జిల్లా సైన్స్ అధికారి సిద్దారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌పై విద్యార్థులకు అవగాహన



సబ్‌స్టేషన్‌ను సందర్శించిన విద్యార్థులు

జహీరాబాద్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు చదువుకోవడం ఓ ఎత్తైతే ప్రాక్టికల్ విధానం మరో ఎత్తని, వారికి ప్రతీ విషయంపై అవగాహన ఉండాలని విద్యుత్‌శాఖ ఏడీఏ మధుసూదన్ అన్నారు. పట్టణంలోని రంజోల్ పాలిటెక్నికల్ కళాశాలకు చెందిన విద్యార్థులు ప్రాక్టికల్‌లో భాగంగా శుక్రవారం సబ్‌స్టేషన్‌కు వచ్చి ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ సరఫరా విధానం, సబ్‌స్టేషన్ నిర్వహణ గురించి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏఈ నాగరాజు, అధ్యాపకులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులను గౌరవించండి

● తారా కళాశాల ప్రిన్సిపాల్ రత్నప్రసాద్


ప్రతిభ కనబర్చిన విద్యార్థినులకు జ్ఞాపికలు అందజేస్తున్న ప్రిన్సిపాల్ అరుణ, అతిథులు

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ తల్లిదండ్రులను గౌరవించాలని తారా కళాశాల ప్రిన్సిపాల్ రత్నప్రసాద్ సూచించారు. సంగారెడ్డిలోని టీఎన్‌జీవోస్ భవన్‌లో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల వార్షికోత్సవాన్ని శుక్రవారం అట్టహాసంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని ఎంచుకొని చదివి లక్ష్య సాధనకు కృషి చేయాలని కోరారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యాలు అలరించాయి. అంతకుముందు విద్యార్థినీలు విద్యతో పాటు వివిధ అంశాల్లో ప్రతిభ కనబర్చిన వారికి జ్ఞాపికలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అరుణ బాయి, అధ్యాపకులు వరలక్ష్మీ, కస్తూరి, నవ్య తదితరులు పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలుడు తల్లి చెంతకు..



అమీన్‌పూర్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి):;ఇంటి నుంచి తప్పిపోయి ఏడుస్తూ కనిపించిన బాలుడిని అమీన్‌పూర్ పోలీసులు చేరదీసి తల్లికి అప్పగించిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. బీరంగూడ ప్రాంతంలోని న్యూసాయిభగవాన్ కాలనీ, రోడ్డు నెంబర్ 6లో ఓ మూడేళ్ల బాలుడు ఏడుస్తూ రోడ్డుపై పోలీసులకు కనిపించాడు. అడ్రస్, పేరు చెప్పలేకపోవడంతో పోలీసులు స్టేషన్‌కు తీసుకెళ్లి తల్లిదండ్రుల ఆచూకీ కోసం ప్రయత్నం చేశారు. వాట్సాప్ గ్రూపుల్లో బాలుడి ఫోటోతో పాటు గుర్తుపట్టిన వారు స్టేషన్‌కు రావాలని సందేశాలను పంపించారు. విషయం తెలుసుకున్న తల్లి సునంద, తండ్రి హన్మంతు పోలీసు స్టేషన్‌కు చేరుకున్నారు. పోలీసులు విచారణ చేపట్టి బాబును తల్లికి అప్పగించారు.

కాంగ్రెస్ మెదక్ జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలిగా ముక్తబాయి

వెల్దుర్తి, ఏప్రిల్4(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలిగా వెల్దుర్తికి చెందిన కొత్తబాయి నియమితులయ్యారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సునీతారావు శుక్రవారం ఆమెకు నియమాకపత్రాన్ని అందజేశారు. ఈ సందదర్భంగా ముక్తబాయి మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

'పిల్లల పట్ల అప్రమత్తంగా ఉండాలి'

నారాయణఖేడ్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): వేసవిలో పిల్లల పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని స్థానిక ఎస్‌ఐ విద్యాచరణ్‌రెడ్డి సూచించారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వేసవికాలంలో పిల్లలు ఈతకు చెరువులు, కుంటల వద్దకు వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. గతంలో పిల్లలు ఈతకు వెళ్లి ప్రాణాలు కోల్పోయిన సందర్భాలు ఉన్నాయన్నారు. ప్రస్తుతం ఐపీఎల్ కొనసాగుతున్నందున పిల్లలు బెట్టింగ్ యాప్‌లు వాడకుండా చూడాలన్నారు. ఎక్కడైనా బెట్టింగ్ నిర్వహిస్తే పోలీసులకు చెప్పాలన్నారు. సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు.



కాలువ నిండా వ్యర్థాలే..

● ముందుకు సాగని మురుగునీరు

నర్సాపూర్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ పట్టణంలోనే ఆ మురికి కాల్వ అతిపెద్దది.. అది ఇళ్ల మధ్య నుంచి పై కప్పు లేకుండా ఉండటంతో సమీపంలోని ఇళ్ల వారంతా ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలను అందులోనే వేస్తున్నారు. దీంతో అది అత్యంత దారుణంగా మారి ఆ ప్రాంత వాసులకే ఇబ్బందికరంగా మారింది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణం పరిధి పదో వార్డులోని శ్రీరాంనగర్ కాలనీలోని అతి పెద్ద మురికికాల్వ ఓ నీటి కాలువను తలపించేలా ఉంటుంది. ఇళ్ల మధ్య నుంచి ప్రమాదకరంగా ఉండటంతో పాటు అందులో చెత్తచెదారం వేయడంతో స్థానిక ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. ఆ కాలువకు పూర్తిగా మరమ్మతులు చేసి పై కప్పు వేయడానికి ఉమ్మడి రాష్ట్రం ఉన్నప్పటి నుంచి ప్రజాప్రతినిధులు, అధికారులు వచ్చి చూడటం ఆ తర్వాత మరిచిపోవడం పరిపాటిగా మారింది. దీంతో ఆ కాలువ స్థానికులకు శాపంగా మారింది. ముఖ్యంగా వర్షాకాలంలో ఈ కాలువ నుంచి మురికినీరు చెత్తచెదారంతో సరిగా వెళ్ల ఇళ్ల మధ్యలోకి కూడా వస్తుంటాయని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా పట్టణంలోనే అతి పెద్ద మురికికాల్వను పూర్తిగా మరమ్మతు చేసి పై కప్పు వేసి తమ ఇబ్బందులు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

కంపుకొడుతున్న ప్రధాన వీధులు

మనూరు, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): సంపూర్ణ పారిశుధ్యం కోసం ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నప్పటికీ అధికారుల నిర్లక్ష్యంతో ప్రభుత్వ ఆశయం నీరుగారిపోతుంది. మనూరు మండలం తోర్నాల్ గ్రామంలో వీధులన్నీ మురుగు గుంటలుగా మారి దుర్గంధ వాసన వెదజల్లుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆవేధన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని వీధుల్లో సీసీ రోడ్లు నిర్మించి.. మురుగు కాలువలు నిర్మించక పోవడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. కొన్ని వీధుల్లో మురుగు కాలువలు ఉన్నప్పటికీ శుభ్రం చేయక పోవడంతో దుర్గంధం వెదజల్లుతుందని, అంటు వ్యాధులు సోకుతున్నాయని వాపోతున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.



మెరుగైన వైద్యమే కాంగ్రెస్ లక్ష్యం

● మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు


ఆయుష్మాన్ ఆరోగ్య ఉప కేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

నిజాంపేట, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని మెదక్ ఎమ్మెల్యే డా.మైనంపల్లి రోహిత్‌రావు అన్నారు. మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన ఆరోగ్య ఉప కేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ముందుగా జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్ ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం రేషన్ షాపుల్లో సన్నబియ్యం పంపిణీ, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేసి మాట్లాడారు. ఆరోగ్యం మనిషి ప్రాథమిక హక్కని అందుకోసం రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా మెరుగైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటుందని కాంగ్రెస్ ప్రభుత్వం వైద్యం, విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ రమాదేవి, వైద్యాధికారి హరిప్రియ, ఇంచార్జీ తహసిల్దార్ రమ్యశ్రీ,అధికారులు కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు.

ఘనంగా రథ శిఖర స్థాపన

జోగిపేట, ఏప్రిల్4(ఆంధ్రజ్యోతి): ఏటా జరిపే అత్యంత వైభవ వేడుకలైన జోగినాథ స్వామి జాతరలో భాగంగా నిర్వహింపబోయే రథోత్సవానికి శుక్రవారం శ్రీకారం చుట్టారు. చైత్ర శుద్ధ దశమి రోజున నిర్వహించే రథోత్సవానికి, సప్తమి రోజున శ్రీకారం చుట్టడం, అనంతరం వరుసగా మూడు రోజుల పాటు రథాన్ని వివిధ రంగులతో అలంకరించి, దశమి నాడు ప్రధాన వీధిలో జోగినాథ గుట్ట వరకు రథాన్ని లాగుడం ఆనవాయితీగా వస్తోంది. ఆనవాయితీ ప్రకారం శుక్రవారం పట్టణానికి చెందిన తాపీ మేస్త్రీలు, నిర్మాణ కార్మికులు కలిసి రథంపై అమర్చే గుండ్లను నెత్తిన ఎత్తుకుని రథం వద్దకు తీసుకెళ్లారు. అక్కడ ఆలయ పూజారి ఆగుండ్లకు పూజ చేసి రథాలంకరణకు శ్రీకారం చుట్టారు. ఈకార్యక్రమంలో రథోత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పన్నుల వసూళ్లలో 12వ స్థానం


కమిషనర్‌ను అభినందిస్తున్న సిబ్బంది

ఐడీఏబొల్లారం ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : ఆస్తిపన్నులు వసూలు చేయడంలో రాష్ట్రస్థాయిలో 12వ స్థానంలో ఉన్నామని మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఐడీఏబొల్లారం మున్సిపల్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. సిబ్బంది కమిషనర్‌ను సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వచ్చే ఆర్థిక సంవత్సరంలో రెట్టించిన ఉత్సాహంతో పని చేయాల్సి ఉంటుందని తెలిపారు. ముందస్తుగా పన్ను చెల్లించిన వారికి నేరుగా ఐదు శాతం తగ్గింపు ఉంటుందని వివరించారు. దీన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని వివరించారు.

దరఖాస్తులను పరిశీలించిన జడ్పీ సీఈవో

రామాయంపేట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల ప్రక్రియను జడ్పీ సీఈవో ఎల్లయ్య పరిశీలించారు. శుక్రవారం రామాయంపేట ఎంపీడీవో కార్యాలయం చేరుకున్న ఆయన.. ఇప్పటివరకు ఎన్ని దరఖాస్తులు వచ్చాయని తెలుసుకున్నారు. వీటిపై ఎంపీడీవో సహజలుద్దీన్‌కు పలు సూచనలు చేశారు.


దరఖాస్తుల ప్రక్రియపై ఆరా తీస్తున్న జడ్పీ సీఈవో

వేసవిలో నీటి ఎద్దడి రాకుండా చూడండి

● ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



సంగారెడ్డి రూరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి నియోజకవర్గంలో గత కొన్ని రోజులుగా నీటి సమస్యపై ప్రజలు స్థానిక ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌కు ఫోన్ చేసి తెలిపారు. దీంతో శుక్రవారం సంగారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వచ్చిన చింతా ప్రభాకర్‌కు ప్రజలు నీటి సమస్యను మరోసారి వివరించారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులకు ఫోన్ చేసి మాట్లాడారు. వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని నీటి సమస్యలు రాకుండా జాగ్రత్తలు చేపట్టాలని సూచించారు. సుదూర ప్రాంతాల గ్రామాలు, తండాల్లో నీటి ఎద్దడి రాకుండా చూడాలని, వాటర్ ట్యాంకర్లతో నీటి సరఫరా చేయాలన్నారు.

గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ లక్ష్యం

● గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి


సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న నర్సారెడ్డి

మనోహరాబాద్ ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ లక్ష్యమని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి అన్నారు. శుక్రవారం మనోహరాబాద్ మండలంలోని రంగాయపల్లి గ్రామంలో మహాత్మగాంధీ ఉపాధి హామీ పథకం ద్వారా మంజురైన సుమారు రూ.9 లక్షలతో సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. అలాగే జీడిపల్లి గ్రామంలో అండర్ డ్రైనేజి పనులను రాష్ట్ర కాంగ్రెస్ యూత్ అధ్యక్షురాలు ఆంక్షరెడ్డితో కలిసి ప్రారంభించారు. నర్సారెడ్డి మాట్లాడుతూ ప్రజా పాలన ద్వారా గ్రామాలను అభివృద్ధి బాటలో నడిపించాలన్నాదే సీఎం రెవంత్‌రెడ్డి లక్ష్యం అన్నారు. కాంగ్రెస్ పేదల కోసం కడుపు నిండలని సన్న బియ్యం తెచ్చిందన్నారు. కార్యక్రమంలో ప్యాక్స్ ఛైర్మెన్ మెట్టు బాలకృష్ణరెడ్డి, పాల గణేష్, పాల అశోక్, శ్రీహరిగౌడ్, శ్రీనివాస్, అంజనేయులు, భాను యాదవ్, మెహన్‌రెడ్డి, నవీన్, కుమార్, కల్యాణ్ పాల్గొన్నారు.

రాజీవ్ యువ వికాసం హెల్ప్ డెస్క్ ఏర్పాటు

జోగిపేట, ఏప్రిల్4(ఆంధ్రజ్యోతి): అందోలు-జోగిపేట మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం రాజీవ్ యువ వికాసం హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేశారు. 18 సంవత్సరాలు నిండిన యువత స్వయం ఉపాధి కోసం రాయితీపై రుణాలు అందించేందుకు రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రభుత్వం ప్రారంభించిన సంగతి విదితమే. దరఖాస్తులను నింపే క్రమంలో ఎదురయ్యే సమస్యలు, ఇబ్బందులను పరిష్కరించి సలహాలు ఇవ్వడానికి శుక్రవారం కార్యాలయ ఆవరణలో హెల్ప్‌డెస్క్‌ను కమిషనర్ తిరుపతి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ శ్రీధర్;; ఆర్‌ఐ నారాయణ, సిబ్బంది లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మిస్సింగ్ కేసుల ఛేదనపై ప్రత్యేక దృష్టి సారించాలి : సంగారెడ్డి ఎస్పీ



పటాన్‌చెరు రూరల్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి) :బీడీఎల్ భానూర్ పోలీసు స్టేషన్‌ను జిల్లా ఎస్పీ శ్రీ పరితోష్ పంకజ్ శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీసు స్టేషన్ పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. అనంతరం స్టేషన్ రికార్డను తనిఖీ చేసారు. అండర్ ఇన్వెస్టిగేషన్‌లో ఉన్న కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా మిస్సింగ్ కేసుల ఛేదనకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, మిస్సింగ్ పర్సన్స్‌ను ట్రేస్ చేయాలన్నారు. ప్రతి వర్టికల్‌కు ఒక అధికారిని నియమించి, రికార్ఫ్ ఎలాంటి పెండింగ్ లేకుండా చూడాలన్నారు. సిబ్బంది అధికారులు స్టేషన్‌కు వచ్చిన వారితో మర్యాదగా మాట్లాడాలని, సివిల్ తగాదాలలో తలదూర్చకూడదన్నారు.

పెద్దమ్మ తల్లికి బోనాలు

అల్లాదుర్గం ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంపూర్ గ్రామ శివారులో 161 జాతీయ రహదారి పక్కనే వెలసిన పెద్దమ్మకు మెదటి వార్షికోత్సవం వైభవంగా జరిగింది. శుక్రవారం పెద్దమ్మ బోనాలను డప్పు చప్పుడుతో, పోతురాజుల నృత్యాలతో వైభవంగా నిర్వహించారు. బోనాలను అమ్మవారికి సమర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.



రాజకీయ చైతన్యంతోనే జాతి మనుగడ

● కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్


సభలో సంఘీభావం తెలుపుతున్న నీలం మధు ముదిరాజ్

పటాన్‌చెరు రూరల్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): రాజకీయ చైతన్యంతోనే జాతి మనుగడ సాధ్యమని, మనమంతా కలిసికట్టుగా ఐక్యమత్యంతో ముందుకు సాగాలని కాంగ్రెస్ నాయకులు నీలం మధు ముదిరాజ్ అన్నారు. శుక్రవారం రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల కేంద్రంలోని మాతృశ్రీ గార్డెన్స్‌లో ముదిరాజ్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ముదిరాజ్‌ల ఆత్మీయ సమ్మేళన సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పట్టణంలోని మహనీయుల విగ్రహాలకు పూలమాలలు వేసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం సమావేశంలో ఆయన మాట్లాడుతూ రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం ముదిరాజ్‌ల సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. ముదిరాజులను బీసీడీ నుంచి బీసీ ఏ లోకి మార్చడంతోపాటు పలు అంశాలను ఇప్పటికే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఈ బృహత్తర ఆత్మీయ సమ్మేళనానికి ఆహ్వానించినందుకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షులు పిట్ల రాంగోపాల్, రాష్ట్ర ముదిరాజ్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జగన్మోహన్, మాజీ రాష్ట్ర ఫిషరీస్ చైర్మన్ పిట్టల రవీందర్, డీఎల్ పాండు, చేన్నవేని రాములు, సిరిసిల్ల జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యక్షులు చొక్కాల రాములు, చొప్పరి రామచంద్రం, రెడ్డబోయిన గోపి, హనుమండ్లు, వెంకటస్వామి, ముత్యాల శ్రీనివాస్, దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

రవాణా, స్టైఫండ్ నిధులు విడుదల

● కేజీబీవీ విద్యార్థినుల కాస్మోటిక్స్‌కు రూ.10 లక్షలు..

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి) :జిల్లాలోని భవిత కేంద్రాల్లో విద్యనభ్యసించే పిల్లలకు సంబంధించిన స్టైఫండ్, ట్రాన్స్‌పోర్ట్, ఎస్కార్ట్ నిధులను ప్రభుత్వం విడుదల చేసింది. ప్రత్యేక అవసరాలున్న పిల్లల కోసం ప్రభుత్వం విలీన విద్యా వనరుల కేంద్రాలను(భవిత)ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. అయితే భవిత కేంద్రాల్లోని చిన్నారుల విద్యాభ్యాసాన్ని ప్రోత్సహించేందుకు ప్రతి నెల ట్రాన్స్‌పోర్ట్, ఎస్కార్ట్, స్టైఫండ్, రీడింగ్ భత్యాలు అందించాల్సి ఉన్నది. ఈ నిధులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో విడుదలవుతాయి. ఈ రకంగా జిల్లాలో 27 భవిత కేంద్రాలుండగా, 10 నెలలకు సంబంధించి స్టైఫండ్, ట్రాన్స్‌పోర్ట్, ఎస్కార్ట్, రీడింగ్ భత్యం కింద రూ. 15 లక్షల నిధులు విడుదలయ్యాయి. ఇక రవాణా భత్యం కింద రూ.30 లక్షల నిధులు విడుదలయ్యాయి. ఇవే కాకుండా జిల్లాలోని 17 కేజీబీవీల్లోని విద్యార్థినీలకు నెలకు రూ.100 చొప్పున ఆరు నెలలకు సంబంధించిన కాస్మోటిక్ చార్జీలు రూ.10 లక్షలు విడుదలయ్యాయి. ఆయా నిధులు విద్యార్థుల ఖాతాలో నెరుగా జమ చేశారు.

ప్రజలకు మెరుగైన సేవలే ఆర్టీసీ లక్ష్యం

● జహీరాబాద్ డిపోమేనేజర్ జాకీర్ హుస్సేన్

జహీరాబాద్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి):ప్రజలకు మెరుగైన సేవలందించడమే లక్ష్యంగా ఆర్టీసీ ముందుకెళ్తున్నదని జహీరాబాద్ డిపోమేనేజర్ జాకీర్ హుస్సేన్ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని ఆర్టీసీ డిపోలో గ్యారేజ్ సిబ్బందికి, డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్సులను ఎప్పటికప్పుడు కండిషన్‌లో ఉంచేలా గ్యారేజి సిబ్బంది చర్యలు చేపట్టాలన్నారు. జహీరాబాద్ డిపోకు చెందిన బస్సులు కండిషన్‌లో ఉండేం దుకు కృషిచేయడంతో పాటు సక్రమంగీఉ పనిచేసిన వారికి ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్నామన్నారు కార్యక్రమంలో సీఐ ప్రవీణ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కార్గో సేవలను సద్వినియోగం చేసుకోవాలి

● ఉమ్మడి జిల్లా కార్గో అసిస్టెంట్ ట్రాపిక్ మేనేజర్ ఇసాఖ్


రికార్డులను తనిఖీ చేస్తున్న ఉమ్మడి జిల్లా కార్గో అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ ఇసాఖ్

పెద్దశంకరంపేట, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న కార్గో సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి జిల్లా కార్గో అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ ఇసాఖ్ అన్నారు. శుక్రవారం పెద్దశంకరంపేటలోని ఆర్టీసీ బస్టాండ్‌లోని కార్గో సెంటర్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు శ్రీరామ నవమి సందర్భంగా స్వామి వారి తలంబ్రాలు, ముత్యాలను కార్గో ద్వారా ఇంటి వరకు అందిస్తున్నామని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని, ఉమ్మడి జిల్లాలో 20 కార్గో సెంటర్ల ద్వారా ప్రజలకు సేవలందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ ఎక్స్‌క్యూటివ్ శివశంకర్, రీజినల్ కంప్యూటర్ ఆపరేషన్ శ్రీనివాస్, పేట కార్గో సిబ్బంది వైద్యనాథ్ తదితరులు ఉన్నారు.

డంపుయార్డు ఏర్పాటును విరమించుకోవాలి

● 59 వ రోజు రిలే నిరాహార దీక్షలు



గుమ్మడిదల, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : నల్లవల్లి ప్యారానగర్‌లో డంపుయార్డుకు వ్యతిరేకంగా గుమ్మడిదల మండల కేంద్రంలో చేపటిన రిలే నిరాహారదీక్షలు శుక్రవారం 59 వ రోజు చేరుకున్నాయి. ఈ దీక్షకు బొంతపల్లి దేవాలయ కమిటీ ప్రతినిధులు సంఘీభావం తెలిపారు. నిరసన కార్యక్రమంలో సీజీఆర్ ట్రస్టు ఛైర్మన్ చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, మాజీ సర్పంచ్ లు సురభి నాగేందర్ గౌడ్, ఆలేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నబోయిన వేణు, జేఏసీ నాయకులు పాల్గొన్నారు. దీక్షలో దేవాలయ కమిటీ అధ్యక్షుడు శంకర్ యాదవ్, రాఘవరెడ్డి, ఎల్లయ్య, విష్ణువర్ధన్,రాజు, నరసింహ, రాములు, నాగరాజు తదితరులు కూర్చున్నారు.

యువతే దేశాభివృద్ధికి మూలం

● మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి


ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి

మెదక్ అర్బన్, ఏప్రిల్4(ఆంధ్రజ్యోతి): బాధ్యత గల యువతే దేశాభివృద్ధికి మూలమని మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన వార్షికోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు ఎంతో బాధ్యతగా వ్యవహరించాలని ఆయన సూచించారు. ఈ కాలంలో పురుషులకంటే మహిళలే అన్ని రంగాల్లో రాణిస్తున్నారని చెప్పారు. చదువుతో వ్యక్తిత్వ వికాసం పొందుతారని, నచ్చిన రంగాన్ని ఎంచుకుని రాణించాలని విద్యార్థులు ఆయన దిశా నిర్దేశం చేశారు. డ్రగ్స్‌కు బానిసై జీవితం నాశనం చేసుకోవద్దని, సైబర్ నేరగాళ్లతో జాగ్రత్తగా ఉండాలన్నారు. క్రమశిక్షణ, బాధ్యతతో ఉంటే తప్పకుండా లక్ష్యాన్ని చేరుకుంటారని ఎస్పీ పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ డా.హుస్సేన్, విద్యార్థులు పాల్గొన్నారు